



అనంతపురం అంబేడ్కర్ విగ్రహం ఎదుట కేక్ కటింగ్.. సంబరాలు..

నగరపాలిక వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌పై ప్రమాణ స్వీకారోత్సవ వీక్షణ



ఆర్ట్స్ కళాశాల వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ఊరూ వాడా సంబరం

- పండుగను తలపించిన ప్రమాణ స్వీకారోత్సవం
- ప్రభుత్వ కార్యాలయాలు, ఇళ్లలో వేడుకల వీక్షణం
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు జై కొడుతూ చిందులు
- నేతల విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం

టీడీపీ అధినేత, ఎన్డీఏ శాసన సభాపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో జిల్లా ప్రజలు పండుగ చేసుకున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ఎన్టీఆర్ విగ్రహాలకు, చంద్రబాబు, పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బాణసంచా పేల్చి చిందులు వేశారు. పసుపు రంగులు చల్లుకున్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించి.. మొక్కులు తీర్చుకున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించడంతో శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది.



రాయదుర్గం: పట్టణంలోని వినాయక సర్కిల్ వద్ద బాణసంచా కాలుస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు





ఉరవకొండ: పయ్యావుల కేశవ్‌కు మంత్రి పదవి దక్కడంతో ఉరవకొండ మండలం కడమలకుంటలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీ పరిధిలోని ఏఎండీ ఫంక్షన్‌లో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని అధికారులు ఏర్పాటు చేసిన స్క్రీన్‌పై చూస్తున్న మహిళలు



కళ్యాణదుర్గం రూరల్: ముద్దినాయనపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నూటొక్క టెంకాయ



పుట్లూరు: మండల పరిధిలోని చింతకుంట గ్రామంలో భైరవ స్వామి, ఎస్సీ కాలనీ పెద్దమ్మ ఆలయాల్లో టీడీపీ నాయకులు నూటొక్క కొబ్బరికాయలు కొట్టారు. శింగనమల ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ, అనంత ఎంపీగా అంబికా లక్ష్మీనారాయణ గెలవడంతో మొక్కు తీర్చుకున్నారు. పార్టీ నాయకులు భైరవేశ్వర్‌రెడ్డి, కృష్ణకాంత్, సుధ, చందు, వెంకటరామిరెడ్డి, నాగ రాజు, బాల కొండయ్య, ప్రసాద్, మనోహర్, నరేష్, గిరివిరెడ్డి త దితరులు పాల్గొన్నారు.



రాప్తాడు: పుల్లలరేవు గ్రామంలో సంబరాలు చేసుకుంటున్న మహిళలు



పామిడి: పట్టణంలో బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

ఎన్నేళ్లో వేచిన ఉదయం..!



- మంత్రిగా పయ్యావుల ప్రమాణం
- ఉరవకొండలో విజయం.. పార్టీకి అధికారం
- 1994 తరువాత బద్దలైన బ్యాడ్ సెంటిమెంట్

అనంతపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆయనది మూడు దశాబ్దాల రాజకీయం. ఎన్టీఆర్ పిలుపుతో 1994లో రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటికి ఆయన వయస్సు 29 ఏళ్లు. యువకుడిగా రాజకీయాల్లోకి వచ్చి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉన్నత విద్యావంతుడు కావడంతో విషయ పరిజ్ఞానం పెంచుకున్నారు. ఎంబీఏ పూర్తి చేసిన ఆయన నోటి వెంట మాట వచ్చిందంటే తూటాలా పేలుతుంది. భాషపై పట్టు.. యాస, ప్రాసను సమపాళ్లలో పండించగల దిట్ట. మైక్ తీసుకున్నారంటే మాటల్లో వాడి.. వేడి స్పష్టంగా కనిపిస్తుంది. ఆయనే ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్. అసెంబ్లీ టైగర్ అని అభిమానులు, సహచర నాయకులు పొగుడుతుంటారు. రాజకీయంగా ఎన్నో ఎత్తు పల్లాలను చూసిన కేశవ్.. మంత్రి అయ్యేందుకు ఏకంగా 30 ఏళ్లు పట్టింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉరవకొండలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభలో స్థానిక ఎమ్మెల్యే హోదాలో పయ్యావుల కేశవ్ చెప్పిన మాటలు అక్షర సత్యం అయ్యాయి. 'సెంటిమెంట్‌ను బ్రేక్ చేయడం ఖాయం. 1994 రిపీట్ అవుతుంది' అని కేశవ్ ధీమాగా అన్నారు. అదే నిజమైంది. అచ్చం అప్పటిలాగే కేశవ్ గెలిచారు.. పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అదనంగా మంత్రి పదవి వరించింది.

ఎన్టీఆర్ పిలుపుతో...

టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పిలుపుతో పయ్యావుల కేశవ్ 1994లో రాజకీయ అరంగ్రేటం చేశారు. ఆ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి వై.శివరామిరెడ్డిపై విజయం సాధించారు. ఆ తరువాత 1999 ఎన్నికల్లో పయ్యావుల ఓటమి చవిచూశారు. 2004, 2009 ఎన్నికల్లో వరుస విజయాలు అందుకున్నారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో పయ్యావుల ఓడిపోయారు. ఆ తరువాత 2019, 2024 ఎన్నికల్లో వరుస విజయాలను అందుకున్నారు. ఇప్పటికి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన పయ్యావుల.. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. 1994 నుంచి 2024 వరకూ జరిగిన ఏడు సార్వత్రికలో కేవలం రెండుసార్లు పయ్యావుల ఓటమి చెందారు.

సెంటిమెంట్‌కు బ్రేక్ పడిందిలా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం నుంచి 1994 ఎన్నికల్లో పయ్యావుల తొలిసారి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. ఆ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత 1999 ఎన్నికల్లో పయ్యావుల ఓడిపోయారు కానీ, టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2004, 2009 ఎన్నికల్లో పయ్యావుల కేశవ్ గెలుపొందారు. టీడీపీ ప్రతిపక్షానికి పరిమితమైంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2014లో పయ్యావుల ఓటమి చెందారు. టీడీపీ అధికారంలోకి వచ్చింది. 2019లో కేశవ్ గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి వచ్చింది. తాజా ఎన్నికల్లో పయ్యావుల కేశవ్ విజయం సాధించారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఇప్పటి వరకూ కొనసాగిన సెంటిమెంట్‌కు బ్రేక్ పడింది.

వివిధ హోదాల్లో..

1997 నుంచి 1999 వరకూ టీడీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా పయ్యావుల కేశవ్ పనిచేశారు. 2002-09 వరకూ పార్టీ విప్‌గా కొనసాగారు. 2009-12 వరకూ అసెంబ్లీలో పబ్లిక్ అకౌంట్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. 2004-14 వరకూ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 2015లో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. 2019 నుంచి ఆయన పీఏసీ చైర్మన్‌గా ఉన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి మంత్రి పదవి చేపట్టారు.

కుటుంబ రాజకీయ నేపథ్యం..

తండ్రి వారసత్వం పుచ్చుకుని.. పయ్యావుల కేశవ్ రాజకీయాల్లో ప్రవేశించారు. 1994లో టీడీపీ అభ్యర్థిగా ఆరంగేట్రం చేశారు. పయ్యావుల కేశవ్ తండ్రి పయ్యావు వెంకటనారాయణ కాంగ్రెస్ పార్టీ తరఫున 1975లో రాయదుర్గం నియోజకవర్గం నుంచి ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. అంతకుముందు ఆయన డీసీసీ అధ్యక్షుడిగా, రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు సమితి అధ్యక్షుడిగానూ పనిచేశారు.

39 ఏళ్ల తర్వాత మంత్రి పదవి

ఉరవకొండ, జూన్ 12: ఉరవకొండ నియోజకవర్గానికి 39 ఏళ్ల తర్వాత మంత్రి పదవి దక్కింది. ఇక్కడి నుంచి గెలిచిన గుర్రం నారాయణప్ప 1985లో మంత్రి అయ్యారు. ఆ తరువాత ఎవరినీ అదృష్టం వరించలేదు. ఇన్నేళ్ల తరువాత టీడీపీ సీనియర్ నాయకుడు పయ్యావుల కేశవ్‌కు మంత్రివర్గంలో స్థానం లభించింది. 1994లో కేశవ్ తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తరువాత మరో నాలుగుసార్లు గెలిచారు. ఉరవకొండ నియోజకవర్గం నుంచి వరుసగా ఏడుసార్లు ఆయన పోటీ చేశారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చినా, కేశవ్ ఓటమి చెందారు. ఎమ్మెల్సీ పదవి ఇచ్చారుగాని.. మంత్రి పదవి దక్కలేదు. ఈసారి మాత్రం నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష నెరవేరుస్తూ.. కేశవ్‌కు మంత్రి పదవి ఇచ్చారు.

ఊరి బడికి ఉరి..!



నగరంలోని ప్రైమరీ పాఠశాల (ఫైల్)



కుందుర్పి మండలం మాయదార్లపల్లిలో విలీనంపై విద్యార్థులతో కలసి ఉద్యమించిన ఊరి ప్రజలు, గేటుకు కంప కొట్టి నిరసన (ఫైల్)

- అశాస్త్రీయంగా 117 జీవో.. ఇష్టారాజ్యంగా విభజన
- ప్రశ్నార్థకమైన ప్రాథమిక పాఠశాలల మనుగడ
- జగన్ తీరుతో చిన్నారులకు నడక భారం
- గురువులను వెంటాడి వేధించిన వైసీపీ ప్రభుత్వం
- కొత్త ప్రభుత్వం రాకతో పూర్వవైభవంపై ఆశలు

విలీనం పేరిట చదువులు దూరం

అనంతపురం విద్య, జూన్ 12: ఒకప్పుడు 'మీ ఊరికి ఏం కావాలి' అని ఏ మంత్రో, నాయకుడో అడిగితే... పిల్లోళ్ల చదువుకోడానికి 'ఊరిబడి' కావాలని కోరేవారు. గుడి కన్నా బడే ముఖ్యమని నమ్మేవాళ్లు. ఊళ్లో బడి ఉంటే పిల్లలు బడిబాట పడతారని, చదువుకుని బాగుపడతారన్నది పెద్దల నమ్మకం. కిలోమీటర్ల దూరం నడవకుండా ఊరిలో ఉండే బడికి పిల్లలు ఆడుతూ పాడుతూ వెళ్తారని దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. అలాంటి ప్రాథమిక పాఠశాలలను 2019-2024 మధ్య ఉన్న జగన్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నార్థకంగా మార్చేసింది. 117 జీవో తీసుకొచ్చి విలీనం పేరుతో ప్రాథమిక పాఠశాలలను విభజించి, విచ్ఛిన్నం చేయాలని చూసింది. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఊరికి కిలోమీటర్ల దూరంలో ఉండే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. ఫలితంగా వేలాది మంది విద్యార్థుల కిలోమీటర్ల దూరం నడవలేక తీవ్ర అవస్థలు పడ్డారు. విలీనం పేరుతో ముక్కలు చేశారు. బడిలో ఉండే 1,2 క్లాసులకు అందనంగా అంగన్వాడీ స్కూళ్ల పిల్లలు వచ్చి కలుస్తారని పేర్కొన్నారు. వాటికి వైఎస్ఆర్ ఫౌండేషన్ స్కూళ్లు అని పేరు పెట్టారు. పిల్లలు వచ్చి చేరకపోగా ఉన్నవారు బయటకు వెళ్లాల్సి వచ్చింది. ఫౌండేషన్ స్కూళ్లన్నీ పేపర్లకు పరిమితమయ్యాయి. క్షేత్రస్థాయిలో ఘోరంగా విఫలమయ్యాయి. విలీనం దెబ్బకు వందలాది బడులను మూసేశారు. దీంతో కొందరు డ్రాపౌట్లుగా మారితే..మరికొందరు ప్రైవేట్ పాఠశాలల బాట పట్టారు. ఉపాధ్యాయులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో కొత్త ప్రభుత్వం కొలువు దీరనుంది. దీంతో ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. ఊరిబడికి ఊపిరి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాడు-నేడు పాఠశాలలను నిరుపయోగం చేశారు



పాఠశాలల విలీనం వల్ల అన్నిరకాలుగా నష్టమే జరిగింది. అప్పటి ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసిన నాడు-నేడు పాఠశాలలు సైతం నిరుపయోగంగా మారాయి. రేషనలైజేషన్ పేరుతో ఉపాధ్యాయులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. వెంటనే 117 జీవోను రద్దు చేయాలి. ప్రైమరీ స్కూళ్లకు ప్రాణం వచ్చేలా మళ్లీ వాటిని యథాతథంగా కొనసాగించాలి.


- అక్కులప్ప, ఏపీపీఈటీ అండ్ ఎస్‌పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

వేలాది పోస్టులు రద్దు చేశారు



రాష్ట్రంలో ప్రాథమిక పాఠశాలల విలీనం వల్ల ప్రాథమిక విద్యకు చాలా నష్టం వచ్చింది. ఆ పాఠశాలల విద్యార్థులు నడవలేక డ్రాప్ అవుట్లుగా మారారు. విద్యార్థుల సంఖ్య తగ్గడం వల్ల టీచర్ పోస్టులు కూడా రద్దు చేశారు. టీచర్ పోస్టులు భర్తీ లేక...బీఈడీ, డీఈడీ చేసిన వారు సైతం నిరుద్యోగులుగా రోడ్డున పడ్డారు. విద్యా రంగానికి ప్రాణ సమానమైన ప్రాథమిక పాఠశాలలు నిలబడాలంటే....117 జీవోను రద్దు చేయాలి. విద్యారంగానికి కొత్త ఊపిరులూదాలి.

- విజయ్‌భాస్కర్, ఏపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు



ఉద్యమించిన పల్లెవాసులు

ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను దూరంగా ఉండే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. ఊరికి దూరంగా ఉండే పాఠశాలలకు వెళ్లే క్రమంలో కొన్ని చోట్ల వాగులు, వంకలు, రహదారులు పిల్లలు చాటాల్సి వచ్చింది. పైగా పసి పిల్లలను నడిచి పక్క ఊళ్లో ఉండే బడులకు వెళ్లడం చూసిన జనాలు మండిపోయారు. ఊళ్లో బడి ఉండి కూడా...పిల్లలకు పక్క ఊరికి ఎలా నడిపించి పంపగలం, ఇదేం విలీనం, మాకొద్దు అంటూ ఉద్యమించారు. పాఠశాలల గేట్లకు తాళాలు వేసి, వాకిళ్లకు కంపలు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. రోజుల తరబడి బంద్ చేసి ఉపాధ్యాయులను వెనక్కు పంపారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో విలీనంపై జగన్ ప్రభుత్వం వెనక్కు తగ్గింది.

విద్యార్థులు, గురువులపై ప్రభావం

గత ప్రభుత్వం అటు విద్యార్థులకు, ఇటు గురువులకు తీరని నష్టాన్ని కలిగించింది. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులతో ఆడుకుంది. 3,4,5 తరగతులను తరలించడంతో ఇతర ఊళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు విముఖత చూపారు. ప్రాథమిక పాఠశాల నుంచి వెళ్లిన 3,4,5 తరగతుల విద్యార్థులు ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఇమడలేక విపరీతంగా డ్రాపౌట్లు పెరిగాయి. వేలాది మంది విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లడంతో జగన్ పరోక్షంగా ఆయా సంస్థలకు లబ్ధి చేకూర్చారు. విలీనం పొందిన పాఠశాలల్లో తరగతి గదులు, సబ్జెక్ట్ టీచర్ల కొరత కూడా ఇబ్బందికరంగా మారింది. కొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ టీచర్ పోస్టులు రద్దయ్యాయి. దీనిపై ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు, ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున వ్యతిరేకించారు. అయినా... మొండి జగన్.. అవేవీ పట్టవన్నట్టుగా ముందుకెళ్లాడు.

ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం వచ్చేనా...?

టీడీపీ అధినేత చంద్రబాబు సారథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుండటంతో ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. టీచర్ల పాలిట శాపంగా మారిన 117 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంగ్లీష్ మీడియంతోపాటు, తెలుగు మీడియం కూడా అమలు చేస్తారని ఆశిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉన్నత పాఠశాలలకు హెచ్ఎం, వ్యాయామ టీచర్ పోస్టులను ఇవ్వాలని కోరుతున్నారు. వందలాది ప్రాథమిక పాఠశాలలకు మళ్లీ జవసత్వాలు వస్తాయని ఆకాంక్షిస్తున్నారు.

మాతృభాషలో బోధన సాగాలి



ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఇతర మేధావులు ఎవరితోనూ చర్చించకుండా ఏకపక్షంగా జీవో 117 తీసుకొచ్చారు. దీంతో విద్యారంగం నిర్వీర్యమైంది. వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయి. ప్రైమరీలో 1,2 క్లాసులు మాత్రమే ఉంచి, ఒక టీచర్‌ను ఉంచడం చూసిన పేరెంట్స్ పిల్లలను పంపేందుకు అయిష్టత చూపారు. ఫలితంగా లక్షలాది మంది పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు తరలి వెళ్లారు. రానున్న ప్రభుత్వం జీవో 117ను రద్దు చేయాలి. మాతృభాషలో బోధన అందించేలా చర్యలు తీసుకోవాలి. సమాంతరంగా ఇంగ్లీష్ మీడియం కూడా నడపాలి.

- అశోక్‌కుమార్, ఏపీటీఎఫ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఆ జీవోను రద్దు చేయాలి

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను ప్రశ్నార్థకంగా మార్చింది. వెంటనే జీవో 117 రద్దు చేయాలి. తరగతి గదిలో విద్యార్థులు ప్రైమరీలో 30 మందికి మించితే, 6,7,8 క్లాసుల్లో విద్యార్థుల సంఖ్య 35కు మించితే, 9,10 క్లాసుల్లో విద్యార్థుల సంఖ్య 40కి మించితే అదనపు సెక్షన్ ఇవ్వాలి. ఉన్నత పాఠశాలల్లో ప్రతి 5 సెక్షన్లకూ ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక వ్యాయామ టీచర్ ఉండేలా చర్యలు తీసుకోవాలి. విద్యాహక్కు చట్టం మేరకు టీచర్ వారానికి 30 నుంచి 32 పిరియడ్లు బోధించేలా ఏర్పాటు చేయాలి.



- హరికృష్ణ, ఎస్టీయూ, రాష్ట్ర అధ్యక్షుడు

బడికి పోదాం పద..!

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

వారంపాటు పర్యావరణ దినోత్సవాలు



పునః ప్రారంభానికి సిద్ధమైన నగరంలోని పొట్టి శ్రీరాములు పాఠశాల

అనంతపురం విద్య, జూన్ 12: వేసవి సెలవులు ముగిశాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. ప్రతి ఏటా జూన్ 12 నుంచి తరగతులు పునఃప్రారంభమౌతాయి. ఈ ఏడాది కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్న నేపథ్యంలో ఒక్కరోజు అదనపు సెలవు వచ్చింది. 13 నుంచి పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, అన్ ఎయిడెడ్, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, బీసీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్.. ఇలా అన్ని యాజమాన్యాల్లో 2,423 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3,81,091 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో బాలురు 2,02,380 మంది, బాలికలు 1,78,711 మంది ఉన్నారు. జిల్లాలోని 1,747 ప్రభుత్వ రంగ పాఠశాలల్లో 2,16,281 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రైవేట్ రంగంలో 676 పాఠశాలలు, 1,64,810 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా బడి బాట పట్టేందుకు సిద్ధమయ్యారు.

పర్యావరణ దినోత్సవాలు

పాఠశాలలు పునః ప్రారంభమయ్యాక వారంరోజులు పర్యావరణ దినోత్సవాలను నిర్వహించాలని ఆదేశాలు వచ్చాయి. ఈ నెల 20 వరకూ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. స్టూడెంట్ కిట్లను ఎంఈఓలు పరిశీలించాలని, సక్రమంగా లేని వాటిని వెంటనే వెనక్కు పంపాలని సూచించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు త్వరలో వీటిని పంపిణీ చేస్తారని సమాచారం. ఉపాధ్యాయులు గతంలో మాదిరి ఫేషియల్ యాప్‌లో హాజరు వేయాలని ఆదేశాలు వచ్చాయి.

30 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూన్ 12 : జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం వర్షం పడింది. అనంతపురం, బెలుగుప్ప, గుంతకల్లు, పుట్లూరు, శింగనమల, నార్పల, తాడిపత్రి, విడపనకల్లు, బొమ్మనహాల్, పెద్దవడుగూరు, డి.హీరేహాల్, యాడికి, పామిడి మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. మంగళవారం రాత్రి జిల్లాలోని 30 మండలాల్లో వర్షం పడింది. అత్యధికంగా పామిడిలో 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. వజ్రకరూరు 26.2, గుమ్మగట్ట 23.4, కణేకల్లు 21.0, విడపనకల్లు 18.6, పుట్లూరు 14.2 మి.మీ. వర్షం పడింది. మిగతా ప్రాంతాల్లో 10.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.


అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న టీడీపీ నాయకులు


ఎన్టీఆర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న చేపలహరి, లింగారెడ్డి, కృష్ణకుమార్, రహ్మత్‌జీ, మారుతి


ఐదో రోడ్డులో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మాజీ కార్పొరేటర్ సరళ


ఆరో రోడ్డులో కేక్ కట్ చేస్తున్న మాజీ కార్పొరేటర్ విజయశ్రీరెడ్డి


20వ డివిజన్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీప్రసాద్


పాత డీఈఓ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు


క్లాక్‌టవర్ వద్ద బీజేపీ నాయకుల సంబరాలు


పాపంపేటలో శ్యామ్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు


చంద్రబాబు సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరైన మాజీ మేయర్ స్వరూప, విశాలాక్షి, సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ రాజారావు

అంబరమే హద్దుగా సంబరం

పండుగను తలపించిన సీఎం, మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో.. నగరం, పట్టణం, గ్రామాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. చంద్రబాబు చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కేక్‌లు కట్ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు. ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.


బీకేఎస్‌లో పెద్దమ్మ అమ్మవారికి 1001 టెంకాయలు కొట్టిన పర్వతనేని శ్రీధర్‌బాబు


ఆకుతోటపల్లిలోని ఇటుకలపల్లయ్య గుడి వద్ద టెంకాయలు కొడుతున్న నాయకులు


కోటంకలో పెద్దస్వామి వద్ద 101 కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నేతలు


నార్పలలో టీడీపీ నాయకుల విజయోత్సవ ర్యాలీ


పుల్లలరేవులో మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ


అమ్మఒడి ఆశ్రమంలో నిత్యావసరాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు


పాతూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సంబరాలు

టీజీ భరత్‌కు శుభాకాంక్షల వెల్లువ

అనంతపురం కల్చరల్, జూన్ 12: ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన టీజీ భరత్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో జిల్లాకు చెందిన ఆర్యవైశ్యులు టీజీ భరత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, గుల్జార్‌పేటలోని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు.

స్తంభాలకు పసుపు రంగు



రాప్తాడు: టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మండలంలోని పలు గ్రామాల్లో పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఎక్కువ వెలుతురు వచ్చేలా పెద్ద స్తంభాలు ఏర్పాటు చేశారు. వాటికి పచ్చ రంగు వేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నాయకులు ఆ స్తంభాలకు తెల్ల రంగు వేశారు. ప్రస్తుతం మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు వాటికి పచ్చరంగు వేయిస్తున్నారు.

ఆకట్టుకున్న అనంత కళాకారులు

అనంతపురం కల్చరల్ : అనంతపురం నగరానికి చెందిన నాట్య కళాకారులు నృత్యాభినయంతో ఆకట్టుకున్నారు. గుంతకల్లు సమీపంలోని చిప్పగిరిలో విజయదాసుల బృందావనంలో నిర్వహిస్తున్న ఆరాధనో త్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం మోహనదాసుల పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా నగరోత్సవం ముందు అనంతపురం నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ వ్యవస్థాప కురాలు దేవర కొండ కౌలస్య బృందం భక్తిగీతా లకు సంప్రదా య నృత్యాలు, కోలాటాలు చేస్తూ అలరించారు.



బాల కార్మిక చట్టాలపై అవగాహన

అనంతపురం క్రైం : ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లోని న్యాయసేవాసదన్‌లో బాల కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. ఇందులో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్, శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం, డిగ్రీ విద్యకు అవకాశం

అనంతపురం క్లాక్‌టవర్: ఇంటర్ చదివిన విద్యార్థులకు ఉద్యోగంతో పాటు ఉచితంగా డిగ్రీ విద్య పూర్తి చేసే అవకాశం కల్పిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీతో పాటు బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 24న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూకు ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.11వేలు వేతనంతో పాటు మూడేళ్ల డిగ్రీ కోర్సు విద్య ఉచితంగా చదివిస్తామని, మరిన్ని వివరాలకు 63032 04295, 91820 63878ను సంప్రదించాలని కోరారు.

పాఠశాలలను సీజ్ చేయాలి

అనంతపురం విద్య : నగరంలో అపార్టుమెంట్లలో నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఐక్య విద్యార్థి సంఘాల నేతలు నగరంలో నిర్వహించిన ధర్నాలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నరేష్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి పృథ్వీ, వీఎస్‌ఐవీ రాష్ట్ర కార్యదర్శి వినోద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఓబులేసు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

పలు ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు.. ఇంటర్ కళాశా లలను కోచింగ్ సెంటర్లుగా మార్చేశాయని, వాటిపై చ ర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నాలో నిర్వహించారు. ఇందులో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేమన, నాయకులు బాలకృష్ణ, నరేంద్ర, నవీన్, జితేంద్ర, శ్రావణ్ పాల్గొన్నారు.

కవి సినారెకు ఘన నివాళి

అనంతపురం కల్చరల్ : జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, ప్రఖ్యాత కవి డాక్టర్ సి నారాయణరెడ్డి (సినారె) వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో ఆయన చిత్రపటానికి బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర, జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య, పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

ఫాగింగ్ చేయించండి

అనంతపురం టౌన్ : దోమలను నివారించడానికి ప్రతి పట్టణ, పల్లెలలోను ఫాగింగ్ చేయించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఓబులు సబ్‌యూనిట్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో సబ్‌యూనిట్ అధికారులతో సీజనల్ వ్యాధులు.. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏడీఎంఓ సత్యనారాయణ, ఎంపీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులో తనిఖీ

అనంతపురం ప్రెస్‌క్లబ్: వినియోగదారుల నుంచి పలు ఫిర్యాదులు అందడంతో నగరంలోని బళ్లారి బైపాస్ సర్వీసు రోడ్డులో ఉన్న భారత్ పెట్రోలియం సీఎన్‌జీ బంకులో తూనికలు, కొలతల శాఖాధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఆ శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ సిబ్బందితో కలిసి ఈ తనిఖీలు నిర్వహించారు. అన్ని సక్రమంగా ఉన్నాయన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

చెన్నేకొత్తపల్లి : స్థానిక ఎస్సీ కాలనీలోని ఓబుళ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. బుధవారం అహోబిళం ప్రధాన అర్చకుడు మధుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్యస్వామికి పూజలు

అనంతపురం కల్చరల్ : జ్యేష్ఠ శుద్ధ షష్టిని పురస్కరించుకుని బుధవారం శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమంలో విశేష పూజలు నిర్వహించారు. వల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించారు.

ఎంపీఆర్, కాలువలకు మరమ్మతులు చేపట్టాలి

చివరి ఆయకట్టుకూ సాగునీరు అందించాలి : కలెక్టర్

గార్లదిన్నె, జూన్ 12 : ఎంపీఆర్ డ్యాం కట్ట, హెచ్ ఎల్సీ కాలువలు ఆధునికీకరణకు తగిన చర్యలు చేపట్టి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సూచించారు. మండలంలోని ఎంపీఆర్ (మిడ్‌పెన్నార్ రిజర్వాయర్) డ్యాంను బుధవారం సాయంత్రం కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. డ్యాం కట్టకు అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలన్నారు. కాలువల పరిశీలనకు అవసరమైన లస్కర్లు నియమించేందుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎంపీఆర్ డ్యాం నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. డ్యాంలో టూరిజం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. అనంతరం గార్లదిన్నెలో తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. శాంతిభద్రలకు విఘాతం కలగకుండా ముందస్తు కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ రాజశేఖర్, ఈఈ రమణరెడ్డి, డీఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ వెంకటలక్ష్మి, ఏఈ సురేంద్రరెడ్డి, సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్‌గౌస్, వ్యవసాయ అధికారి సోమశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వోల్వో బస్సులు నడపాలి

అనంతపురం టౌన్: అనంతపురం నుంచి హైదరాబాదు, బెంగళూరుకు ప్రయాణికులు వెళ్లేందుకు వోల్వో బస్సులు నడపాలని కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. ఆర్టీసీ శాఖాధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు స్కిల్‌డెవలప్‌మెంటు పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆర్టీసీ ప్రయాణికులకు, బాలికలకు కల్పిస్తున్న రాయితీలపైనా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డీపీఓ ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హుసేన్‌బాషా, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీడీపీ శ్రేణులు



అనంతపురంరూరల్ : రాప్తాడు నియోజకవర్గం ఎమ్మెల్యే పరిటాల సునీతను, పరిటాల శ్రీరామ్‌ను మండల టీడీపీ నాయకులు కలిశారు. బుధవారం మండలంలోని కక్కలపల్లి కాలనీకి చెందిన నాయకులు విజయవాడలో ఆమెను మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కొల్లు రవీంద్రకు సన్మానం



అనంతపురం ప్రెస్‌క్లబ్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కొల్లు రవీంద్రను జిల్లాకు చెందిన బీసీ సంక్షేమ సంఘం నేతలు సత్కరించారు. బుధవారం విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు.

మిలటరీ మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : రాప్తాడు మండలం పంగలరోడ్డు వద్ద ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఎనిమిది బాక్సుల మిలటరీ మద్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. రూ.1,52,100 విలువైన 96.. 750 ఎంఎల్ మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. అనంతపురం నగరంలో అధిక ధరలకు విక్రయించడానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుబడినట్లు సీఐ యల్లయ్య తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం.. ముగ్గురిపై కేసు : అనంతపురం రూరల్ మండలం కాటిగానికాల్వలో రైతుభరోసా కేంద్రంలో శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనలో అనంతపురం రూరల్ పోలీసులు బుధవారం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. లక్ష్మీదేవి, రామాంజినేయులు, చంద్రమౌళినాయుడుపై కేసు నమోదు చేశారు.

డిప్యూటీ సీఎం రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి

అనంతపురం న్యూటౌన్, జూన్ 12: కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఎన్నికైన పవన్ కల్యాణ్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వాసు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి ఉన్నతమైన పదవును మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు.





మేం విన్నాం... మేం చూశాం..!

సీఎం ప్రమాణ స్వీకార వేడుకను భారీ స్ర్కీన్‌లపై వీక్షించిన ప్రజలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పయ్యావుల కేశవ్, సత్యకుమార్, సవిత ప్రమాణ స్వీకార వేడుకను ప్రత్యక్షంగా వీక్షించడం కోసం జిల్లా వ్యాప్తంగా భారీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. దీంతో వారి ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు విన్నారు.. చూశారు.. జిల్లావ్యాప్తంగా 455 ప్రాంతాల్లో భారీ స్ర్కీన్‌లను జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసింది. కలెక్టరేట్, ఎంపీడీఓ కార్యాలయాలు మొదలు.. గ్రామీణ ప్రాంతాల్లో భారీ స్ర్కీన్‌లపై అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని తిలకించారు.







రేషన్ డీలర్లపై చర్యలు తీసుకోండి

శింగనమల, జూన్ 12: రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు ఇవ్వకుండా వైసీపీకి చెందిన డీలర్ల స్వాహా చేయడానికి యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ శోభన్‌బాబుకు వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. శింగనమలలో ఐదు రేషన్‌షాపుల్లో 40 కింట్వాళ్ల బియ్యాన్ని అక్రమంగా అమ్ముకొన్నట్లు ఆరోపించారు. శింగనమలలో ఈ ఐదు రేషన్ షాపుల పరిధిలో 1300పైగా రేషన్ కార్డులు ఉండాగా ఇప్పటి వరకు 900 మందికి మాత్రమే ఎండీయూ ఆపరేటర్ బియ్యం పంపిణీ చేశారన్నారు. రెండు రోజుల నుంచి ఎండీయూ ఆపరేటర్ రేషన్ ఇవ్వడం లేదని, వారిని సంప్రదిస్తే తమ వద్ద స్టాక్ లేదని చెబుతున్నారని అన్నారు. అక్రమాలకు పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ... గ్రామంలో ప్రతి రేషన్ కార్డుదారుడికీ రేషన్ అందేలా చర్యలు తీసుకుంటామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

ఆంధ్రా క్రికెట్ విజేత జిల్లా జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 12: ఆంధ్రా క్రికెట్ అండర్-19 మహిళా సౌత్‌జోన్ విజేత అనంతపురం జిల్లా జట్టు నిలిచింది. ఆంధ్రా క్రికెట్ అండర్-19 మహిళా సౌత్‌జోన్ పోటీల్లో కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జట్లపై వరుస విజయాలు నమోదు చేసిన జిల్లా జట్టు బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో నిర్వహించిన కడప మ్యాచ్‌లో వర్షం కారణంగా రద్దు చేశారు. అండర్-19 జిల్లా మహిళా జట్టు 14 పాయింట్లతో విజేతగా ప్రకటించారు. ఈ టోర్నీలో జిల్లా బ్యాటర్లు నేహా 170పరుగులు, ఆర్షియా 113పరుగులు, అమూల్యా 100 పరుగులు సాధించారు. జిల్లా బౌలర్లు హన్సిరెడ్డి 11వికెట్లు తీసింది.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

అనంతపురం రూరల్: మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణపై టీడీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకరణ సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయానికి ఎంపీటీసీ రత్నమ్మ, మాజీ సర్పంచు సుశీలమ్మ, ఇతర టీడీపీ నాయకులు వెళ్లారు. కార్యాలయంలో గతంలో ఉన్న చంద్రబాబు చిత్రపటాన్ని ఇవ్వాలని స్థానిక కార్యదర్శి లక్ష్మీనారాయణను అడిగారు. దీంతో ఆ పంచాయతీ కార్యదర్శి నానా దుర్భాషలాడుతూ.. వారిని కొట్టేందుకు వెళ్లారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రకాష్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.



సభా వేదిక వద్ద కోలాహలం





వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

బస్సెక్కిన అభిమానం









చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు పదర్శన



వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి



జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..





మంత్రి సవితకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



మంత్రి పయ్యావుల కేశవ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

అమాత్యులకు అభినందనలు

అనంతపురం అర్బన్: జిల్లా నుంచి మంత్రులుగా ప్రమాణ స్వీకారం పయ్యావుల కేశవ్, సవితకు అభినందనలు వెల్లువెత్తాయి. మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సవితకు శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విజయ వాడ లో సవితను కలిసి వారు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సవితకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు.
- రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పయ్యావుల కేశవ్‌కు విజయవాడలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ మేయర్ స్వరూప, టీడీపీ గాండ్ల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ కార్యకర్త ఆత్మహత్య

గుడిబండ, జూన్ 12: మండల పరిధిలోని మందలపల్లి ఎస్సీ కాలనీకి చెందిన మూగప్పగారి హనుమంతరాయప్ప(43) వైసీపీ ఓటమిని జీర్ణించుకోలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ మణి ప్రతాప్ తెలిపారు. హనుమంతరాయప్ప వైసీపీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఉండేవాడు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమితో తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. టీడీపీ కూటమి తరఫున బుధవారం మంత్రివర్గ ప్రమాణ స్వీకారం ఉండటంతో ఆ వార్తలను టీవీలో చూసి జీర్ణించుకోలేకపోయాడు. బహిర్భూమికి వెళ్లి.. గ్రామ సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య హనుమక్క, కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



చింతచెట్టుకు ఉరి వేసుకుని..

అయోధ్యకు ఆర్టీసీ బస్సుయాత్ర

హిందూపురం అర్బన్, జూన్ 12: ఏపీఎస్ ఆర్టీసీ హిందూపురం డిపో ఆధ్వర్యంలో అయోధ్య, కాశీ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఎనిమిది రోజుల యాత్రలో 14 పుణ్యక్షేత్రాలు, పుణ్య నదీ స్నానాలు ఉంటాయని డిపో మేనేజర్ శ్రీకాంత్ బుధవారం ప్రకటించారు. హిందూపురం నుంచి ఈ నెల 24, జూలై 12, ఆగస్టు 9తేదీల్లో మూడుసార్లు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. మొదట హైదరాబాద్ శంషాబాద్ వద్ద చిన్నజీయర్ స్వామీజీ నిర్మించిన రామానుజాచార్యుల ఆలయం, యాదగిరిగుట్ట, నరసింహస్వామి దేవాలయం అక్కడ నుంచి నిజామాబాద్ బాసర సరస్వతీ దేవాలయం, అలహాబాద్ ప్రయాగ్ రాజ్‌గంగ, యమున, సరస్వతీ పుణ్యనదుల నదీ స్నానాలు, అయోధ్య శ్రీబాలరాముడి దర్శనం, సీతాదేవి ఇల్లు, జనకమహారాజ్‌కోట, అనంతరం కాశీలోని విశ్వనాథుని దర్శనం, విశాలాక్షమ్మ దర్శనం, గంగానదీ పుణ్యతీర్థ స్నానం, కాలబైరవ దర్శనం, విశాఖ పట్నం రామకృష్ణ బీచ్, కైలాసగిరి, సింహాచలం అప్పన్న దర్శనం, అన్నవరం, సత్యనారాయణ స్వామి దర్శనం, ద్వారక తిరుమల వెంకటేశ్వరస్వామి దర్శనం, అన్నమయ్య క్షేత్రం, విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం, అమరావతి, అమరేశ్వరుని దర్శనం, కోటప్పకొండ శ్రీపరమేశ్వర లింగదర్శనం, శ్రీశైల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దర్శనం, యాగంటి బసవన్న దర్శనం చేయించి హిందూపురంతో యాత్ర ముగుస్తుందన్నారు. 14 రోజుల యాత్రకు ధర కేవలం రూ. 8,500 ఉంటుందన్నారు. వంట వారిని ఆర్టీసీ ఏర్పాటు చేస్తుందని ఆహార దినుసులు బస్సులో యాత్రికులు అందించాలన్నారు. విడిది సమయంలో యాత్రికులే ఖర్చులు భరించాలన్నారు. యాత్రకు వెళ్లదలచిన వారు రిజర్వు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9440834715, 7382863007, 73828 61308ను సంప్రదించాలన్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు..

గుంతకల్లు, జూన్ 12: రైల్వే లైన్లకు విద్యుత్ పనుల వల్ల ఏర్పడనున్న ట్రాఫిక్ బ్లాక్‌ల కారణంగా కొన్ని రైళ్లను రద్దు చేసి, మరికొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు బుధవారం తెలిపారు. నాందేడ్-బెంగళూరు నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (నెం. 16594) రైలును జూలై 30, ఆగస్టు 6, 13 తేదీల్లో రద్దు చేసినట్లు తెలిపారు. జూలై 2, 9 తేదీల్లో ఈ రైలును యలహంక-బెంగళూరు సెక్షన్‌లో రద్దు చేసి, యలహంక-నాందేడ్ మధ్య నడపనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణపు రైలు (నెం. 16593)ను జూలై 2, 9, 30 తేదీల్లోనూ, ఆగస్టు 6, 13 తేదీల్లో దాదాపు గంటన్నర ఆలస్యంగా నడపనున్నట్లు వివరించారు. ముంబై- బెంగళూరు మధ్యన నడిచే ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్ (నెం. 11301) రైలును జూలై 2, 9 తేదీల్లో గౌరీబిదనూరు నుంచి బయ్యపనహళ్లి, బెంగళూరు, హోసూరు మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. ఈ రైలు అరగంట ఆలస్యంగా నడపనున్నట్లు తెలిపారు. యశ్వంతపూర్-కోర్బా ఎక్స్‌ప్రెస్ (నెం.12251) రైలును ఈనెల 18న బాలార్షా, నాగపూర్, గోండియా స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలిపారు.

చీనీకాయలు టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, జూన్ 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 802 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైసీపీ పాలనలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నాం

- ఇక స్వేచ్ఛగా పని చేస్తాం
- సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజినరెడ్డి

హిందూపురం, జూన్ 12 : వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండున్నరేళ్లుగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నామని, కొత్త ప్రభుత్వంలో స్వేచ్ఛగా పని చేస్తామని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భీమిరెడ్డి అంజినరెడ్డి పేర్కొన్నారు. బుధవారం హిందూపురంలో గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజినరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మారిన నేపథ్యంలో సచివాలయ ఉద్యోగుల్లో ఆందోళన, అనుమానాలు నెలకొన్నాయన్నారు. అయితే అలాంటి వాటికి ఆస్కారం లేదన్నారు. మంత్రి నారాలోకేష్ స్పష్టమైన హామీ ఇచ్చారని, సచివాలయ ఉద్యోగులు స్వేచ్ఛగా పని చేసుకోవచ్చన్నారు. గతంలో ఉద్యోగులు ఎన్నో అవమానాలు, ఇబ్బందులకు గురయ్యారు. రెండు సంవత్సరాల్లో ప్రొబెషన్ డిక్లరేషన్ చేస్తామని తొమ్మిదినెలలు ఆలస్యంగా ఇచ్చారన్నారు. అది కూడా ఉద్యోగులు ఉద్యమిస్తేనే ప్రభుత్వంలో చలనం వచ్చిందన్నారు. సచివాలయ ఉద్యోగులను పలుశాఖల అధికారులు అజమాయిషీ చేసి బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నామన్నారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వానికి భజనపరుడిగా ఉన్న వెంకటరామిరెడ్డి అసోసియేషన్‌ను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించారన్నారు. తన అధికారంతో బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ప్రజలకు మంచి సేవ అందిద్దామని ఈ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలని, సమస్యలేవైనా ఉంటే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో సత్యసాయిజిల్లా అసోసియేషన్ అధ్యక్షులు జేపీరెడ్డి, రాష్ట్ర కమిటీ నాయకులు శ్రీనివాసులు, హర్షవర్ధన్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భీమిరెడ్డి అంజినరెడ్డి




బెళుగుప్పలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు



ఆంజనేయస్వామికి 101 కొబ్బరికాయలను కొడుతున్న టీడీపీ నాయకులు (కుందుర్పి)



దేవగిరి క్రాస్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు (బొమ్మనహాళ్)



పట్టణంలోని శాంతినగర్‌లో కేక్‌కట్ చేస్తున్న కూటమి నాయకులు (రాయదుర్గంరూరల్)

అంబరమంటిన సంబరం

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం టీడీపీ శ్రేణుల సంబరాలు అంబరాన్నంటాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఐదు నియోజకవర్గాల్లోనూ పార్టీ కార్యకర్తలు, నాయకులు బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కేక్ కట్ చేసి పంచుకున్నారు. ఎంపీడీఓ ఆఫీస్, తహసీల్దార్ ఆఫీస్, ఆర్బీకే వంటి ప్రభుత్వ కార్యాలయాలు, ఫంక్షన్ హాళ్లలో ఏర్పాటు చేసిన లైవ్ టెలీకాస్ట్‌ను పలువురు నాయకులు, మహిళలు వీక్షించారు. అంతకుముందు దేవాలయాల్లో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో మొక్కలు నాటారు. మరికొన్ని చోట్ల అభిమాన నాయకుల చిత్రపటాలు, ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు.

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



ఎల్ఈడీ స్ర్కీన్‌పై కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు(యల్లనూరు)



గుత్తిలో మిఠాయిలు తినిపించుకుంటున్న టీడీపీ నాయకులు



గుంతకల్లు టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్‌చేసి వేడుక చేసుకుంటున్న పార్టీ నాయకులు



గుంతకల్లు 12వ వార్డులోని తిలక్‌నగర్‌లో కేక్‌ను కట్‌చేసి మిఠాయిని పంచుకుంటున్న టీడీపీ నాయకులు



సీఎం ప్రమాణస్వీకారోత్సవాన్ని పామిడిలో తిలకిస్తున్న ప్రజలు, అధికారులు



ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు(డి.హీరేహాళ్)



కొత్తపల్లిలో సంబరాల్లో తెలుగు తమ్ముళ్లు (యాడికి)



కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు (విడపనకల్లు)



సంబరాలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు (తాడిపత్రి టౌన్)



తాడిపత్రిలో కేక్‌కట్ చేస్తున్న కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి



కొనకొండ్లలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



ఉరవకొండలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు



యల్లనూరులో కేక్‌కట్ చేస్తున్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు (పుట్లూరు)



గుంతకల్లులో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



గుత్తి ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు



అపిలేపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



కణేకల్లు మండలం మారెంపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ప్రభుత్వం బలోపేతానికి కృషి



విలేకరులతో మాట్లాడుతున్న కూటమి పార్టీల నాయకులు

బొమ్మనహాళ్, జూన్ 12: కూటమి పార్టీల నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని టీడీపీ నాయకులు సప్తగిరి, సత్యనారాయణ, కటిగె నారాయణ, బీజేపీ మండల కన్వీనర్ అంజి అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంపై బుధవారం మండలంలోని దేవగిరి గ్రామంలో వారు విలేకరులతో మాట్లాడారు. మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అప్పారావు, గ్యాస్ గోవిందు, ఆంజనేయులు, ఖాశీం, షేక్‌గౌస్, పీరాబాష తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల్లో అధికారుల తనిఖీ



మటన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

గుత్తి, జూన్12: మున్సిపల్ పరిధిలో చికెన్, మటన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, నియమ నిబంధనలు పాటించని ఐదు చికెన్ దుకాణాలను మూసివేయించారు. మరో ఐదు దుకాణాల యజమానులను తీవ్రంగా మందలించారు. పరిశుభ్రత పాటించకుండా షాపులను నిర్వహిస్తే సీజ్ చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రంగయ్య, పీపీఓ అప్పస్వామి, సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయంలో టీడీపీ నాయకుల ప్రత్యేక పూజలు

బెళుగుప్ప, జూన్ 12: మండలంలోని కోనాపురంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రిగా పయ్యావుల కేశవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రామాలయంలో సీతారాములకు 101 టెంకాయలు కొట్టి పూజలు చేసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నాయకులు జయరాములు, శశిభూషణ్, ధనుంజయ, నారాయణ స్వామి, శ్రీరాములు, నెట్టం నారాయణ స్వామి, రమేష్, మురళి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి బండే సుభాన్

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 12: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బండే సుభాన్ పేర్కొన్నారు. బాల కార్మిక నిర్మూలన దినాన్ని బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరు తీసుకోవాలని బాలలను ఉన్నత విద్య వైపు అడుగులు వేసేందుకు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేంద్రప్ప, న్యాయవాదులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ నిర్లక్ష్యంపై టీడీపీ శ్రేణుల ఆగ్రహం

కళ్యాణదుర్గంరూరల్, జూన్ 12: ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధికారులు ప్రతి పట్టణంలో ప్రజలు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా పెద్దపెద్ద ఎల్ఈడీ టీవీలు, ప్రొజెక్టర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఆదేశాలు ఏమీ పట్టనట్లుగా కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్ నర్సారెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరించారని టీడీపీ శ్రేణులు అసహనం వ్యక్తం చేశాయి. రూరల్ మండల పరిధిలోని ప్రజలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రొజెక్టర్ ద్వారా ప్రమాణ స్వీకారం వీక్షించేలా ఏర్పాటు చేశారు. మున్సిపాల్టీ పరిధికి సంబంధించి కన్యకాపరమేశ్వరస్వామి దేవాలయంలో టీడీపీ మాజీ కౌన్సిలర్లు, మహిళా సంఘాలు వీక్షించేందుకు చిన్నపాటి రెండు ఎల్ఈడీ టీవీలు కమిషనర్ తూతూ మంత్రంగా ఏర్పాటు చేశారు. ఈ రెండింటిలో కూడా ఒక టీవీ మాత్రమే పనిచేయగా మరోటి మరమ్మతులకు నోచుకోవడం గమనార్హం. దీంతో కమిషనర్ నర్సారెడ్డి తీరు పట్ల పలువురు టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈయన కడప నుంచి కళ్యాణదుర్గం పట్టణానికి బదిలీపై వచ్చారు.



ఏర్పాటు చేసిన చిన్న ఎల్ఈడీ టీవీలలో ఒకటి పనిచేస్తూ మరొకటి మరమ్మతుకు నోచుకున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో మృతుడి వివరాలు లభ్యం

గుంతకల్లు టౌన్, జూన్12: మండలంలోని నక్కనదొడ్డి గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న టోల్ గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతుడి వివరాలు లభ్యమయ్యాయి. ప్రమాదంలో కడపకు చెందిన ఆస్పరి తేజ(21)మృతి చెందినట్లు రూరల్ పోలీసులు గుర్తించారు.

వారు తెలిపిన మేరకు.. కడపలో ఆస్పరి తేజ బెల్దారీ పని చేస్తున్నాడు. అతడి భార్య శిరీష సీమంతం కార్యక్రమానికి పిలిచేందుకు చిప్పగిరి మండలం నగరడోన్‌లోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి రాత్రి కడపకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. నక్కనదొడ్డి గ్రామ సమీపంలో టోల్ గేట్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ సడన్‌గా తిప్పడంతో అతను లారీని ఢీకొని కింద పడి మృతి చెందాడన్నారు. మృతుడికి రెండేళ్ల కిందట వివాహం అయ్యిందన్నారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు గ్రామాల్లో దోపిడీ యత్నం

యల్లనూరు, జూన్12: మండలంలో మంగళవారం రాత్రి రెండు గ్రామాల్లో చోరీకి దుండగులు ప్రయత్నించారు. కూచివారిపల్లి గ్రామంలో శ్రీదేవి ఆరుబయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ఆమె మెడలో ఉన్న గొలుసును అపహరించడానికి దుండగుడు ప్రయత్నించాడు. ఆ సమయంలో ఆమె ప్రతిఘటించడంతో కొడవలితో దాడిచేశాడు. ఈ దాడిలో ఎడమ చేతికి రక్తగాయాలయ్యాయి. బొప్పేపల్లి గ్రామంలో కూడా అర్ధరాత్రి సమయంలో తాళాలు పగలగొట్టి ఇంటిలోకి చొరబడుతుండగా చుట్టుపక్కల వారు గట్టిగా అరవడంతో పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఒకేరోజు వరుసగా రెండు సంఘటనలు చోటుచేసుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎస్ఐ గిరిబాబు ఉదయమే రెండు గ్రామాలకు వెళ్లి పరిస్థితి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

బెళుగుప్ప, జూన్ 12: మండలంలోని యలగలవంకకు చెందిన జయమ్మ (48) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 8న పొలంలో గట్టుపై నుంచి కిందపడటంతో తలకు గాయమైంది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయినట్లు మృతురాలి కుమారుడు ప్రకాష్ తెలపడంతో కేసు నమోదు చేశామన్నారు.

అలరించిన నృత్యాంజలి

పుట్టపర్తి, జూన్ 12: సత్యసాయి యూత్ బృందం ప్రదర్శించిన కథక్ నృత్యాంజలి భక్తులను మైమరపింపజేసింది. హరయాణాకు చెందిన 2వేలమంది భక్తులు పర్తియాత్ర చేపట్టి బుధవారం స్థానిక ప్రశాంతినిలయం చేరుకున్నారు. సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి శరణం మమ పేరిట సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం యువత కథక్ నృత్యాంజలి పేరిట నృత్యంతో భక్తులను అలరింపజేశారు.

బెళుగుప్ప మండలంలో మోస్తరు వర్షం



బెళుగుప్ప, జూన్ 12 : మండలంలో బుధవారం మోస్తరు వర్షం కురిసింది. వారం రోజులకు పైగా రోజు వర్షం కురుస్తుండటంతో వ్యవసాయ పనులు చేసుకునే వీల్లేకుండా పోయిందని రైతులు చెబుతున్నారు. పొలాల్లో గడ్డిమొక్కలు మొలుస్తున్నాయని వెల్లడించారు. కాస్త తెరిపిస్తే సేద్యపు పనులు చేసుకుంటామని వారు పేర్కొంటున్నారు.

సబ్సిడీపై కందుల పంపిణీ

పుట్లూరు, జూన్12: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు 50క్వింటాళ్ల కందులు మంజూరైనట్లు బుధవారం మండల వ్యవసాయ అధికారి కాత్యాయిని తెలిపారు. ఒక బ్యాగులో 4కేజీలపై సబ్సిడీ పోను రైతు వాటా కింద రూ.392 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. విత్తన కందులు కావాల్సిన రైతులు వెంటనే ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

తాడిపత్రి టౌన్, జూన్ 12: ప్రజా వ్యతిరేక ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం వెంటనే రద్దుచేయాలని శ్రీలక్ష్మీదుర్గ లీగల్ అసోసియేట్స్ ఆధ్వర్యంలో లాయర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కోరారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా అసోసియేట్స్ అధ్యక్షుడు మూతి రాజగోపాల్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. పలువురు సభ్యులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

మరోసారి నీట్‌గా నిర్వహించాలి: ఎన్ఎస్‌యూఐ

రాయదుర్గం రూరల్, జూన్ 12: నీట్‌ను రద్దు చేసి మరొకసారి నిర్వహించాలని ఎన్ఎస్‌యూఐ రాయదుర్గం నియోజకవర్గం అధ్యక్షుడు అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ కమిటీ పిలుపులో భాగంగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ నెల 4న విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దేశవ్యాప్తంగా 67 మంది మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించి వారు కావడం అనేక అనుమానాలకు దారి తీస్తోందన్నారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట మండల అధ్యక్షులు జోసఫ్, ఎన్ఎస్‌యూఐ నాయకులు వీరేష్, పవన్, వినయ్, మనోజ్, హరి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి



డివైడర్ల మధ్యలో మొక్కలు నాటుతున్న టీడీపీ నాయకులు

గుత్తి, జూన్ 12: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గాంధీ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు డివైడర్లలో గతంలో అధికారులు నాటిన మొక్కలు పర్యవేక్షణ లేక ఎండిపోయాయి. దీంతో టీడీపీ నాయకులు నడుము బిగించి ఎండిన మొక్కలు తొలగించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు బుధవారం మొక్కలు నాటారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా తాము ఈ మొక్కలు నాటామని వీటిని అధికారులు పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోర్‌వెల్ నాగరాజు, మల్లికార్జున, రసూల్, మాబు, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు వ్యవసాయ పనిముట్లు

కళ్యాణదుర్గం రూరల్, జూన్ 12: కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ పనిముట్లు రైతులకు అద్దెకు ఇస్తామని కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ సి రాధా కుమారి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. పనిముట్లు కావాల్సిన రైతులు పని దినాలలో ఉదయం 9 గంటల నుండి నాలుగు గంటల మధ్యలో సంప్రదించాలని తెలిపారు. రూ. 5 వేలు, ఆధార్ కార్డు అడ్వాన్స్‌గా చెల్లించి తీసుకెళ్లవచ్చని తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్ 8919099476, 9052443737, కిసాన్ విత్తనం గొర్రు, ఒక్క రోజు బాడుగకు రూ. వెయ్యి, ట్రాక్టర్ స్ప్రేయర్ రూ. 800, బాతుకాళ్ల మడక రూ. 800, బెడ్ల గుంటక రూ.500, పవర్ విడర్ రూ.500 అద్దెకు దొరుకుతుందని తెలిపారు. వీటితోపాటు జీవన ఎరువులు సుడోమోనాస్, ట్రైకో డెర్మ ద్రవ రూపంలో దొరుకుతాయని తెలిపారు. వీటి ధర లీటరుకు రూ.330 అని వెల్లడించారు.